క్లుప్తంగా

రైతులకు సూచనలు



చవిటిదిబ్బలులో రైతులకు సాగుపై సూచనలిస్తున్న ఏవో ఉషారాణి

వై.రామవరం: పొలంబడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని చవిటిదిబ్బలు గ్రామంలో ఇంతవరకు నిర్వహించిన శిక్షణ తరగతులపై బుధవారం వ్యవసాయశాఖ ఏఓ ఉషారాణి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ప్రకృతి సాగులో పలు అంశాలపై రైతులను ప్రశ్నలు అడిగి పరీక్షించారు. అనంతరం పలుచోట్ల పొలాలను పరిశీలించారు. ఇందులో భాగంగా వరినాట్లు వేసే విధానం, అనంతరం వరి ఆకుల కొనలు తుంచడం, పిలకలను తొలగించడం, పొలం గట్లపై బంతి, కంది, తదితర విత్తనాలను నాటడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్ బచ్చలి చిన్నమ్ములు, వైఎస్సార్‌సీపీ నేత రమేష్, వీఏఏలు, వీహెచ్‌ఏలు, ఎంఏఓలు, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంటులు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొయ్యూరు: రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహా సభలను వచ్చే నెల 25 నుంచి 27వ తేదీ వరకు బాపట్లలో నిర్వహించనున్నట్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ తెలిపారు. మండలంలోని బంగారంపేటలో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అటవీ హక్కులు, కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంటల నిల్వలకు శీతల గిడ్డంగులు నిర్మించాలని, పంటలకు గిట్టుబాటును కల్పించాలని కోరారు. అనంతరం జరిగిన ఎన్నికలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా కె.సింహాచలం, అధ్యక్షుడిగా నానాజీ, కార్యదర్శిగా సత్యంబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సత్యనారాయణ, సింహాచలం, పోతురాజు, చింతపల్లి ఎంపీటీసీ సభ్యుడు సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో సర్వే వేగవంతం

కొయ్యూరు: పీవీటీజీ గ్రామాల్లో సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ సహాయకులను ఆదేశించారు. ఆయన కార్యాలయంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. పీవీటీజీ గ్రామాల్లో వివిధ అంశాలకు సంబంధించి వివరాలు సేకరించాలన్నారు. విద్యార్థుల హాజరు పెంచే విధంగా ఉపాధ్యాయులు చూడాలన్నారు. సంక్షేమ సహాయకులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించి క్రీడాకారుల ఎంపికపై పలు సూచనలిచ్చారు. ఈకెవైసీపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. స్పందనలో నమోదైన సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి, పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి, విధిగా కార్యాలయానికి హాజరు కావాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

అడ్డతీగల: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ఏడు మండలాల సచివాలయాల కన్వీనర్లతో సమావేశం ఏర్పాటు చేసినట్టు ఎల్లవరంలోని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు పాల్గొంటారన్నారు. అందరు సచివాలయ కన్వినర్లు తప్పని సరిగా ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు. వచ్చేటప్పుడు ప్రతి ఒక్క కన్వీనర్ ఒరిజినల్ ఆధార్‌కార్డు తప్పకుండా తీసుకురావాలని కోరారు.

ఈ-పంట నమోదుపై నిర్లక్ష్యం వద్దు

యలమంచిలి : రైతులు ఈ పంట నమోదు పక్కాగా నమోదు చేసుకునేలా వ్యవసాయాధికారులు చూడాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు. బుధవారం మండలంలో తెరువుపల్లి గ్రామంలో పంట పొలాల్లోకి వెళ్లి రైతులతో మాట్లాడి పంటల వివరాలు తెలుసుకొని వాటి వివరాలు ఈ కర్షక్ యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. యలమంచిలి మండల వ్యవసాయాధికార కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేస్తున్న అన్ని రకాల పంటలను ఈ కర్షక్ యాప్‌లో తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. యలమంచిలి డివిజన్‌లో అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఈకేవైసీ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు.

బీట్‌రూట్ సాగు.. లాభాలు బాగు

- ఆశాజనకంగా ధరలు
- ఆనందంలో గిరిజన రైతులు



శాస్త్రవేత్త శివకుమార్



బీట్‌రూట్ పంట



బీట్‌రూట్ దుంపలు

చింతపల్లి: ఏజెన్సీలో పండించే అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఎక్కువ. ఇందుకు ఇక్కడి వాతావరణం, సేంద్రియ పద్ధతుల సాగు ప్రధాన కారణం. ఉత్తమ పోషకాల్లో ఒకటిగా బీట్‌రూట్‌కు ఈ ప్రాంత భూములు, ఏజెన్సీ వాతావరణం ఎంతో అనుకూలంగా ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. మంచి మార్కెట్ ఉండడంతో మండలంలోని బీట్‌రూట్ పంటను విస్తారంగా పండిస్తున్నారు. మన్యంలో సేంద్రియ పద్ధతిలో పండించే బీట్‌రూట్‌కు మైదాన ప్రాంతాల్లోని మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బీట్‌రూట్ సాగుపై తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ పలు సూచనలిచ్చారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

బీట్‌రూట్ సాగులో సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించ వచ్చని ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ తెలిపారు. మన్యంలో గిరిజనులు వివిధ రకాల కూరగాయలతో పాటు బీట్‌రూట్‌ను వాణిజ్యపరంగా సాగుచేస్తున్నారు. బీట్‌రూట్ క్యానింగ్ చేయడానికి ఇక్కడి నేలలు అనువుగా ఉంటాయి. లోతైన, సారవంతమైన ఇసుక నేలలు అనువైనవి. అధిక క్షారత గల చౌడుభూముల్లో పెంచవచ్చు. మన్యంలో చల్లని వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంటుంది. మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా 15 రోజుల వ్యవధిలో విత్తుకుంటే గిట్టుబాటు ధరలు పొందవచ్చు. ఒక్కో సీడ్ బాల్‌లో రెండు కంటే ఎక్కువ విత్తనాలు ఉంటాయి. ఎకరాకు 3 కిలోల విత్తనం సరిపోతుంది. వరుసల మధ్య 45 సెంటీ మీటర్లు, వరుసలలోని మొక్కల మధ్య 10 సెంటీ మీటర్ల దూరం ఉండేలా విత్తుకోవాలి.

బీట్ రూట్‌లో రకాలు

డ్రాయిట్ డార్క్‌రెడ్: పంటకాలం 80 నుంచి 100 రోజులు. అధిక దిగుబడిని ఇస్తుంది. గడ్డపై పొర బాగా ఎర్రగా ఉంటుంది.

క్రిమన్స్ గ్లోబ్: గడ్డ గుండ్రంగా ఉండి, పై పొర లేత ఎరుపు రంగులో ఉంటుంది. పంటకాలం మూడు నెలలు. దిగుబడి బాగుంటుంది.

ఎర్లీ వండర్: పంటకాలం రెండు నెలలు.గడ్డ ఎర్రగా ఉంటుంది.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

మండలంలోని చౌడుపల్లి, పెంటపాడు, జి.కే.వీధి మండలం రింతాడ, మాలిగుడ, దారకొండ ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో పండిస్తున్నారు. వారపు సంతలో పది కేజీల బీట్‌రూట్ గంప రూ.500 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. విశాఖపట్నం, గాజువాక, నర్సీపట్నం, అనకాపల్లి, తుని, ఒడిశాకు చెందిన మల్కన్‌గిరి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు స్థానిక సంతలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా గిరిజన రైతులు పలు ప్రాంతాలకు వ్యాన్‌లలో బీట్‌రూట్ తరలించి విక్రయిస్తున్నారు. మంచి ధరలు ఉండడంతో ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

ఎరువుల వినియోగం

ఆఖరి దుక్కిలో ఎకరాకు 14 కిలోల నత్రజని, 44 కిలోల భాస్వరం,14 కిలోల పొటాష్ వేసుకోవాలని ద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్ సూచిస్తున్నారు. విత్తిన 25 రోజులకు ఎకరాకు 14 కిలోల నత్రజని,14 కిలోల పొటాష్ వేయాలని చెబుతున్నారు.

జాగ్రత్తలివీ

బీట్‌రూట్ సాగులో గింజలు మొలకెత్తిన తర్వాత, ఒక్కో గింజ బాల్ నుంచి 2 నుంచి 6 మొలకలు వచ్చే అవకాశముంది. బలమైన మొలక ఉంచి మిగిలినవి తొలగించాలి. ఇలా కనీసం రెండు సార్లు చేసి, మొలకెత్తిన 25 రోజుల తరువాత కలుపుతీసి మట్టి ఎగదోయాలి. దీని వలన గడ్డ బాగా ఊరుతుందని శాస్త్రవేత్త శివకుమార్ తెలిపారు.

సంక్షేమ పాలనకు చిరునామా జగన్



పులుసుమామిడిలో గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- 'గడప గడప'కు కార్యక్రమానికి గిరిజన గ్రామాల్లో విశేష స్పందన

జి.మాడుగుల: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి సంక్షేమ పాలనకు చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని బొయితిలి గ్రామ సచివాలయ పరిధిలో ఎగమండిభ, దిగమండిభ, సుబ్బులు, తోకగరువు, పులుసుమామిడి గ్రామాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో 284 గడపలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నాలుగున్నర ఏళ్ల కాలంలో ఏఏ పథకంలో ఎంతం సహాయం ప్రభుత్వం అంచిందన్న వివరాలను గణాంకాలతో సహ ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను, సుపరిపాలనను అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్నారని ఆమె చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించాలని కోరారు. చంద్రబాబును నమ్మితే రాష్ట్రం అంధకారమవుతుందన్నారు. బొయితిలి, కిల్లంకోట, జి.మాడుగుల సర్పంచ్‌లు లసంగి మాలన్న, బూటారి శంకరరావు, కిముడు రాంబాబు, మాతే వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యులు గబ్బాడి సన్యాసిదొర, కె.చిన్నారావు, చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యలింగం, మాజీ ఎంపీటీసీ బ్రహ్మలింగం, మండల సచివాలయ కన్వీనర్ ఎల్.కళ్యాణం, సచివాలయ కన్వీనర్లు సూర్యప్రకాష్‌నాయుడు, బాలయ్యపడాల్ , మైనార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ నాగూరుబాబు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన



చినభీంపల్లిలో పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మురళి , జెడ్పీటీసీ సత్యవేణి

దేవీపట్నం: ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ. 24 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఇందుకూరు పంచాయతీలోని చినభీంపల్లి గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలను గతేడాది ఎంపీపీ పాఠశాలగా మార్చారు. పాఠశాలకు పక్కా భవనం కోసం స్థానికులు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు దృష్టికి తీసుకెళ్లారు. వారి చొరవతో నాడు-నేడు ద్వారా పాఠశాలకు పక్కా భవన నిర్మాణానికి రూ.24లక్షల నిధులు మంజూరయ్యాయి. ఎంపీపీ కుంజం మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి చేతులమీదుగా గ్రామస్తుల సమక్షంలో బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. త్వరితగతిన భవన నిర్మాణం పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నాయకులు కె.బాబ్జి, జి.మురళీకృష్ణ, ఎస్.పెద్దబ్బాయిదొర, కె.లక్ష్మణ్, డి.కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు



పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో సీతయ్య, ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్

కొయ్యూరు: డ్రాపౌట్లను వెంటనే పాఠశాలల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకుంటామని ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. మండలంలో రాజేంద్రపాలెంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను వారు బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో 360 మంది విద్యార్థినులకు గాను 285 మంది ఉన్నట్టు గుర్తించారు. గైర్హాజరైన డ్రాపౌట్లను గుర్తించి, వెంటనే పాఠశాలకు తిరిగి వచ్చేలా చూస్తామన్నారు. ఈ మేరకు బాధ్యతను సచివాలయ సంక్షేమ సహాయకులు, వలంటీర్లకు అప్పగిస్తామన్నారు. పాఠశాలలో పలు తరగతులను సందర్శించి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులపై పలు ప్రశ్నలు అడిగారు. విద్యార్థినులకు పలు సూచనలు చేశారు.భోజన, వసతి సదుపాయంపై ఆరా తీశారు. పాఠశాలను త్వరలో మరోసారి సందర్శిస్తామని, అప్పటికి నూరుశాతం హాజరు ఉండాలని సూచించారు హెచ్‌ఎం గోపాల్, ఉపాధ్యాయులున్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



చింతపల్లిలో ఓ వీధిలోని నీటి నిల్వలను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాఘవన్

చింతపల్లి: మండల కేంద్రంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆమె బుధవారం సందర్శించారు. పలు వీధుల్లో వర్షపునీటి నిల్వలు, డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టడంతో పాటు దోమల నివారణ స్ప్రేయింగ్ పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. వర్షపు నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులు మెరుగు పరిచేందుకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్ తదితరులున్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము, చికిలింత, రాజవొమ్మంగి ప్రాంతాల్లోని గ్రామ సచివాలయాలను డీఎల్‌పీవో జి.ఎల్.ఎస్.వి.రాఘవన్ బుధవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. కార్యదర్శులు తదితర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలిచ్చారు. తాగునీటి సరఫరాలో కొరత రాకుండా చూడాలన్నారు. డెంగ్యూ, మలేరియా తదితర కీటక జనిత రోగాలు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. డ్రైయినేజీల్లో మురుగు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. పంచాయతీ సాధారణ సమావేశాలను ప్రతి నెల జరపాలని ఆదేశించారు. సంవత్సరంలో నాలుగుసార్లు (జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెలల్లో) గ్రామసభలు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రోపర్టీ రిజిస్టర్ తయారు చేయాలని సూచించారు. భవనాల పన్నులు వసూలు వేగవంతం చేయాలన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని పట్టణ ఎస్‌ఐ వి.సత్యనారాయణ అన్నారు. కోట్నీవీధి మరిడిమాంబ పండగను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు నెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. రోజువారి పనుల ఒత్తిడిలో ఉన్న వారికి ఇలాంటి పోటీలు ఆటవిడుపునిస్తాయన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి, 84వ వార్డు ఇన్‌చార్జి కొణతాల రాఘవ మాట్లాడుతూ ఈ నెల 31న అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు ఏడు రోజులపాటు జరుగుతాయన్నారు. ప్రథమ విజేతకు రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతులు కూడా అందించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ఎస్‌ఐ సత్యనారాయణను కోరుకొండ రాఘవ మిత్ర మండలి సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, సభ్యులు అలం ప్రసాద్, కోరుకొండ వాసు, సీతా నూకరాజు, కె.నాగరాజు, ఎల్.స్వప్న, కేతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆదివాసీ ప్రొఫెసర్ 'కోడా' పేటెంట్‌పై హర్షం



కోడా దిలీప్ కుమార్

హుకుంపేట: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కోడా దిలీప్‌కుమార్ డీప్ లెర్నింగ్ ఉపయోగించి ఎలక్ట్రికల్ వాహనాలు వేగంగా సురక్షితంగా చార్జింగ్ చేయడానికి డైనమిక్ పవర్ కేటాయింపు అనే అంశంపై పరిశోధన చేశారు. దీనికి భారత ప్రభుత్వం జనరల్ కార్యాలయం ద్వారా పేటెంట్ హక్కును కల్పించిన విషయం తెలిసిందే. దీనిపై మండలంలోని కోడెలి గ్రామానికి దిలీప్‌కుమార్ కుటుంబసభ్యులతో పాటు ప్రముఖులు, గ్రామస్తులు తదితరులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

రమ్మీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు సిమ్మన్నగారి ఊరు శివార్లలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్న వారిలో ముత్యాలమ్మపాలేనికి చెందిన మైలపల్లి బంగార్రాజు, మైలపల్లి పోలరాజుతో పాటు తంతడి గ్రామానికి చెందిన చోడిపల్లి పైడిరాజు కలిసి సిమ్మన్నగారి ఊరు సమీపంలో ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతున్నట్లు బుధవారం సాయంత్రం 7గంటల సమయంలో సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నట్టు చెప్పారు. ఈ దాడిలో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడడానికి ఉపయోగించిన 8 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామని సీఐ ఈశ్వరరావు తెలిపారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు



పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో విద్యార్థులు, అధ్యాపకులు

వై.రామవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, పి.యర్రగొండలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో తెలుగు భాష వారోత్సవాలను బుధవారం ఘనంగా జరిపారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు, గిడుగు వెంకటరామ్మూర్తిల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ వారి చరిత్రలను వివరించారు. ప్రిన్సిపాల్ జి.ఈశ్వరకృష మాట్లాడుతూ మహనీయుల బాటలో నడవాలని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అధ్యాపకులు మాణిక్యం, పాపారావు, దొరబాబు, తదితరులు పాల్గొన్నారు. పి.యర్రగొండ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తెలుగు భాషా వారోత్సవాల ప్రత్యేకతను వివరించారు.అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల కోసం ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

రావికమతం: వర్షాలు కురవాలని కోరుతూ కొమిర ఉరలోవ కొండపై ఉన్న గుండం(చెలమ)కు గిరి మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. గుండానికి పూజలు చేయడం పూర్వ కాలం నుంచి ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. వర్షాలు కురవక వరి నారు ఎండిపోతుండడంతో గుండానికి పాలు, పూలతో పూజ చేసి, నివేదన చేశామన్నారు.

మార్కెట్ షెడ్ల వినియోగానికి చర్యలు



మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ రాజారమేష్

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న సంతషెడ్లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ అన్నారు. అరకు సంత బయలు మార్కెట్ యార్డ్ కార్యాలయంలో మార్కెట్ డైరెక్టర్లు, ముఖ్య నాయకులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డుంబ్రిగుడ మండల కేంద్రంలో ఉన్న మార్కెట్ అధీనంలోని సంతషెడ్లు ఆక్రమణకు గురవుతున్నట్టు వచ్చిన ఫిర్యాదులతో గిరిజన రైతుల కోసం షెడ్లను తాత్కాలికంగా వినియోగించుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన రైతులు దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి, షెడ్లు కేటాయిస్తామన్నారు. మార్కెట్‌లో షెడ్ల కోసం రైతులు అరకు సంతబయలులో మార్కెట్ యార్డ్ కార్యాలయంలో ఆధార్, పట్టా పాస్ పుస్తకం జెరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యదర్శి జగన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.బి.సొర్రు, నాయకులు శ్రీరాములు, సింహాచలం, కృష్ణారావు, మల్లేష్, గ్రామ సచివాయ మండల కన్వీనర్ గణపతి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ఎస్‌ఐ అరుణ్‌కిరణ్



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కుమారి, సీఐ అశోక్‌కుమార్



గడుతూరులో రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

చింతపల్లిరూరల్: ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా మండంలోని చౌడుపల్లిలో బుధవారం గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తదితరులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాజ్‌మా విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. ఎస్‌ఐ అరుణ్‌కిరణ్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమని, గిరిజనులు వాటికి దూరంగా ఉండాలన్నారు. రైతులు వాణిజ్య పంటలపై దృష్టి సారించాలన్నారు. అగ్రికల్చర్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో 22 ఆర్‌బీకే కేంద్రాల్లో 708 క్వింటాల రాజ్‌మా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చౌడుపల్లి సర్పంచ్ లలిత, ఎంపీటీసీ మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రైతులకు రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బోయిన కుమారి పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి సాగుకు బదులుగా గిరిజనులకు ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ , ఏవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని గడుతూరు పంచాయతీ కేంద్రంలోని ఆర్‌బీకేలో రైతులకు రాజ్‌మా విత్తనాలను వైఎస్సార్‌సీపీ నాయకులు చత్రపతి, మత్స్యకొండబాబు తదితరులు పంపిణీ చేశారు.

సజావుగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి

ఎటపాక: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఎంపీపీ కాక కామేశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న విద్యాకానుకను మండలంలోని 4,716 మంది విద్యార్థులకు అందించామని ఎంఈవో సరియం రాజులు చెప్పారు. నాడు-నేడు ద్వారా రెండు విడతల్లో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మండల వ్యాప్తంగా 98శాతం మందికి అమ్మఒడి అందించామని స్పష్టం చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు దేవి మాట్లాడుతూ అంగన్‌వాడీలకు నిల్వ ఉన్న పౌష్టికారం, గుడ్లు తదితర నిత్యావసర సరకులను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై సంబంధిత శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సరిహద్దు కన్నాయిగూడెం వరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సులు నడపాలని, విద్యార్థులకు బస్ పాస్‌ల సౌకర్యం కల్పించాలని ఎంపీటీసీ సభ్యుడు వర్సా బాలకృష్ణ ఆర్టీసీ అధికారులను కోరారు. పలు సమస్యలను పలువురు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. సర్పంచ్ రాజులు, తహసీల్దార్ పృథ్వీ, ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత తదితరులు పాల్గొన్నారు.